క్లుప్తంగా

మందుబాబులకు జరిమానా

పెందుర్తి : పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఏడుగురికి కోర్టు చోరో రూ.10 వేలు చొప్పున, రూ.70 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. సోమవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

యువ జవాన్ మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న ఫార్మాసిటీ అధికారులు, ఉద్యోగులు

పరవాడ: యువ జవాన్ ముదవత్ మురళీనాయక్ వీర మరణం పట్ల విశాఖ ఫార్మాసిటీ ఉద్యోగులు సంతాపం తెలిపారు. ఫార్మాసిటీ కామన్ ఎఫ్లూమెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటులో సోమవారం ఏర్పాటు చేసిన సంతాప సభలో మురళీనాయక్ చిత్రపటానికి ఉద్యోగులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మురళి ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ రెండు నిముషాలు మౌనం పాటించారు. మన దేశం ఓ యువ జవాన్‌ను కోల్పోవడం బాధాకరమని రాంకీ డీజీఎం హెచ్ఆర్ గిరిధర్‌రావు భక్షి అన్నారు. మురళీనాయక్ అమర్‌రహే అంటూ ఉద్యోగులు నినాదాలు చేశారు. సంతాప సభలో సంస్థ ఉన్నతాధికారులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 7 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హేమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై 7 వినతులు అందాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.హేమావతి వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్-8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు తొలిరోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నిర్వహించిన ప్రథమ సంవత్సరం పరీక్షలో తెలుగు పేపర్-1కు 33 మంది విద్యార్థులకు గాను 31 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ పి.సుభాషిణి, డిపార్ట్‌మెంటల్ అధికారి బి.రాధిక తెలిపారు. సంస్కృతం పేపర్-1లో 37 మందికిగాను 34 మంది, వృత్తి విద్యా కోర్స్ నందు 29 మందికి 28 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం జరిగిన ఇంటర్ సెకండియర్ పరీక్షల్లో తెలుగు పేపర్-2కు 8 మంది, సంస్కృతం పేపర్-2లో 7గురు విద్యార్థుకు 5గురు, వృత్తి విద్య జనరల్ ఫౌండేషన్ కోర్స్ నందు 19 మంది విద్యార్థులకు 18 మంది హాజరైనట్లు వెల్లడించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదన్నారు.


సేవకు ప్రతిరూపాలు నర్సులు



స్టాఫ్ నర్సు అరుణను సత్కరిస్తున్న కరణంరెడ్డి, డాక్టర్ రమేష్‌బాబు

పెదగంట్యాడ: ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతూ ఆస్పత్రుల్లో చేరిన వారికి మేమున్నామని ధైర్యం చెప్పేవారే నర్సులని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పెదగంట్యాడ ఆరోగ్య కేంద్రం స్టాఫ్ నర్సు అరుణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు, నాయకులు కిల్లాన ముసలయ్య, జి శంకరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో..



కేక్ కట్ చేస్తున్న నర్సింగ్ సిబ్బంది

అగనంపూడి: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో నర్సింగ్ సిబ్బంది కొవ్వొత్తులు వెలిగించి ప్రతిజ్ఞ చేశారు. తర్వాత కేక్‌కట్ చేసి సంబరాలు చేశారు. మదర్ థెరిసా, ఫ్లోరెన్స్ నైటింగేల్ వంటి వారి సేవల వల్ల నర్సులకు మంచి గుర్తింపు వచ్చిందని నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి అన్నారు.



పెందుర్తి తహసీల్దార్ కార్యాలయం వద్ద గుబురుగా పెరిగిన పిచ్చి మొక్కలు

'మా ప్రాంతంలో ఏ ఇంటి వద్ద చూసినా పిచ్చి తుప్పలు పెరిగిపోయాయి. వాటిని జీవీఎంసీ ఎప్పటికప్పుడు తొలగించట్లేదు. దీంతో అవి మరింతగా పెరిగి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. తుప్పల్లో పాములు, ఇతర విషకీటకాలు ఇళ్లలోకి చొరబడుతున్నాయి. తరచూ పురుగులు ఇంట్లోకి రావడంతో పిల్లలు భయపడుతున్నారు. జంగిల్ క్లియరెన్స్ కోసం జీవీఎంసీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. ఉన్నతాధికారులు స్పందించి తుప్పలు తొలగించాలి'

– లక్ష్మీపురానికి చెందిన ప్రసాద్ విన్నపం

'మా కాలనీలో ఏ వీధిలో చూసినా రోడ్లకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోయాయి. రాత్రి సమయంలో రోడ్లపై నడుస్తుంటే పాములు, ఇతర కీటకాలు వస్తున్నాయి. ఒక్కోసారి ఇళ్ళల్లోకి కూడా చొరబడుతున్నాయి. తుప్పలు తొలగించాలని ఎన్నిసార్లు ప్రజావాణిలో అర్జీలు పెట్టినా ఎవరూ పట్టించుకున్న పాపాన పోవడం లేదు'

– సప్తగిరినగర్‌కు చెందిన లక్ష్మీదేవి ఆవేదన

తుప్పలు.. తిప్పలు





సాయినిరంజన్ కాలనీ పార్కులో పెరిగిన తుప్పలు



వేంకటాద్రి సమీపంలో పెరిగిన తుప్పలు

పెందుర్తి: జీవీఎంసీ **విలీన** ప్రాంతాల ప్రజలను **పిచ్చి** తుప్పలు, డొంకలు వేధిస్తున్నాయి. జనావాసాల్లో ఎక్కడికక్కడే తుప్పలు పెరిగిపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇంటి చుట్టూ పచ్చదనానికి బదులు ఈ పిచ్చి మొక్కలు ఎక్కువై నరకం చూస్తున్నారు. ఏళ్ల తరబడి జనావాసాల్లో జీవీఎంసీ అధికారులు జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమం చేపట్టని పరిస్థితి. దీంతో ఈ తుప్పలు మరింతగా పెరిగి, కాలనీల్లో ఇబ్బందులకు కారణమవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

అంతులేని నిర్లక్ష్యం

జోన్-8 పరిధిలో వందలాది కాలనీలు ఉన్నాయి. జీవీఎంసీలో విలీనం అయ్యి దాదాపు రెండు దశాబ్దాలు కావస్తున్నా లేఅవుట్‌లు, ప్రభుత్వ భూముల్లో, రోడ్లకు ఇరువైపులా ఖాళీ స్థలాలు చాలానే ఉన్నాయి. దీంతో సాధారణంగానే పిచ్చితుప్పలు, ముళ్ల డొంకలు పెరిగిపోయాయి. అయితే వీటిని జీవీఎంసీ అధికారులు బాధ్యతగా తీసుకుని తొలగించాలి. ఆ దిశగా జోనల్ ప్రజారోగ్య సిబ్బంది దృష్టి సారించని పరిస్థితి. దీంతో శివారు ప్రాంతాలు, కాలనీల్లో తుప్పలు, డొంకలు రోజురోజుకూ విస్తరిస్తున్నాయి. వీటి కారణంగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

విష కీటకాలకు ఆవాసం

గత వర్షాకాలంలో పెందుర్తి పట్టణ ప్రాంతంతో పాటు చినముషిడివాడ, సుజాతనగర్, వేపగుంట, పురుషోత్తపురం, చీమలాపల్లి, లక్ష్మీపురం, భవానినగర్, పాపయ్యరాజుపాలెం, గొల్లవిల్లివానిపాలెం, అప్పన్నపాలెం ప్రాంతాల్లో దాదాపు వందకు పైగా ఇళ్లలో పాములు చొరబడ్డాయి. అదృష్టవశాత్తూ వాటి వలన మనుషులకు అంతగా హాని జరగలేదు. పాములు, తేళ్లు, జెర్రి, మిడతలు, పెంకిపురుగులతో పాటు ఇతర విషకీటకాలకు ఈ పిచ్చి తుప్పలే నిలయాలుగా మారుతున్నాయి. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా ఇళ్లలోకి చొరబడి గృహస్తుల్ని భయాందోళనకు గురిచేస్తున్నాయి. రానున్న వర్షాకాలానికి ముందే జనావాసాల్లో తుప్పల్ని తొలగించాలి. లేకుంటే వర్షాకాలంలో మరింతగా తుప్పలు పెరిగే అవకాశాలున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వేసవి కాబట్టి జీవీఎంసీ అధికారులు స్పందించి జనావాసాల్లో జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని కోరుతున్నారు.

జంగిల్ క్లియరెన్స్‌పై దృష్టి సారిస్తాం



కాలనీల్లో జంగిల్ క్లియరెన్స్ చేయాలని వినతులు వస్తున్నాయి. దీనిపై తగు చర్యలు తీసుకునేలా మా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. స్థానికుల నివేదన ఆధారంగా జంగిల్ క్లియరెన్స్ కోసం యంత్రాంగాన్ని సిద్ధం చేస్తాం. ఖర్చుతో కూడుకున్న పని కాబట్టి ఉన్నతాధికారులకు నివేదించాలి. ప్రైవేట్ స్థలాల్లో తుప్పలు ఉంటే యజమానినే బాధ్యులను చేస్తాం. యజమానులు స్పందించకపోతే నోటీసులు ఇచ్చి ఆయా స్థలాల్లో జంగిల్ క్లియరెన్స్ చేపట్టి, ఆ ఖర్చును వారి నుంచి అధికారికంగా రాబట్టే ప్రయత్నం చేస్తాం.

– కె.హేమావతి, జోనల్‌కమిషనర్, జోన్-8



చినముషిడివాడ జనావాసాల్లో పెరిగిపోయిన ముళ్లతుప్పలు



జీవీఎంసీ 97వ వార్డు కాంతినగర్‌లో పెరిగిన ముళ్ల తుప్పలు, పిచ్చి మొక్కలు

ఉమాచంద్రమౌళీశ్వరుడికి విశేష పూజలు



సింహాచలం: అడవివరంలోని విజినిగిరి పాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

రవాణా సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిటు నాయకులు

పరవాడ: ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో రవాణా రంగ డ్రైవర్లు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. లంకెలపాలెం కూడలిలో సమ్మె వాల్ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థలో రోడ్డు రవాణా రంగం కీలకపాత్ర వహిస్తోందన్నారు. ఈ రంగంలో ఆటో, మోటార్, బస్, లారీ, వ్యాన్ల ద్వారా ప్రయాణికులను, సరకులను చేరవేస్తున్నారన్నారు. ఇలాంటి రంగంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. దీనికి నిరసనగా సదరు కార్మికులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కాత వెంకటస్వామి, నరసింగరావు, ఠాగూర్, మధు, నరసింగరావు, రమణ పాల్గొన్నారు.

నర్సుల సేవలు మరువలేం..



హాజరైన నర్సింగ్ విద్యార్థులు, నర్సులు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్

పెందుర్తి: స్థానిక అమృత ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్, సెయింట్ జోసెఫ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్, బేతనీ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలు సంయుక్తంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించాయి. 600 మంది నర్సింగ్ విద్యార్థులతో పెందుర్తి కూడలి నుంచి చినముషిడివాడ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పెందుర్తి కూడలిలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన వేడుకలను మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో నర్సులకు ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. సేవ, త్యాగనిరతి, నిబద్ధతకు నిదర్శనం నర్సింగ్ వృత్తి అని కొనియాడారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సేవలందించాలని సూచించారు. నర్సింగ్‌ను ఉపాధి మార్గంలా కాకుండా రోగుల సేవకు దొరికి మహద్భాగ్యంగా భావించాలన్నారు. అలాంటి వారే వృత్తిలో రాణించడం తోపాటు, రోగులు, వారి బంధువుల మన్ననలు చూరగొంటారని పేర్కొన్నారు. ఆయా నర్సింగ్ కళాశాలల అధినేతలు ఎస్.లక్ష్మీనరసింహం, డాక్టర్ సునీత, పి.సునీల్, కేజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్ స్వర్ణలత, ఏపీ నర్సింగ్ అసోషియేషన్ అధ్యక్షురాలు టి.భవాని, కార్యదర్శి జీవీఎస్ వరలక్ష్మి, సింహాద్రి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ వాసు, అమృత విద్యా సంస్థల డైరెక్టర్ వీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

బర్ధన్‌నగర్‌కు వెలుగులివ్వండి

- మేయర్‌కు కాలనీవాసులు, సీపీఐ నాయకుల వినతి



మేయర్ పీలా శ్రీనివాసరావుకు సమస్యలు వివరిస్తున్న బర్ధన్‌నగర్ కాలనీవాసులు

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు బర్ధన్‌నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలంటూ కాలనీవాసులు మేయర్ పీలా శ్రీనివాసరావుకు మొరపెట్టుకున్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ఈ మేరకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మేయర్‌తో మాట్లాడుతూ 2014 నుంచి 100 కుటుంబాలు నివాసం ఉంటున్నట్లు తెలిపారు. నాటి నుంచి ఇప్పటివరకు విద్యుత్ సదుపాయం గానీ, రోడ్లు గానీ, ఇతర మౌలిక వసతులు గానీ లేవని వాపోయారు. జీవీఎంసీ నుంచి 3 చేతి బోర్లను మాత్రమే ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కనీసం వీధి లైట్లు కూడా లేకపోవడంతో రాత్రుళ్ల చిమ్మ చీకట్లలో పిల్లాపాపలతో ఉండలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు పదేళ్లకు పైగానే కనిపించిన ప్రతి ఒక్కరికీ పదేపదే మొరపెట్టుకుంటున్నా తమ గోడు వినిపించుకునే నాథుడు లేకపోయారని వాపోయారు. తమకు సత్వరమే కనీస వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. దీనికి మేయర్ సానుకూలంగా స్పందించినట్లు కాలనీ వాసులు తెలిపారు. కాలనీ వాసులకు మద్దతుగా సీపీఐ నాయకులు ఆర్.శ్రీనివాస్, వై.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం



డ్రాయింగ్ పోటీల్లో తాము వేసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా సోమవారం విద్యార్థులకు ఆయుర్వేద మూలికా వైద్యంపై అవగాహన కల్పించారు. ఆయుర్వేద మూలికా వైద్య నిపుణుడు కంబేటి సన్యాసిరావు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మన ఇల్లే పెద్ద వైద్యశాల అని తెలిపారు. ఇంట్లో లభించే వస్తువులతో కొన్ని చిట్కాలు తెలియజేశారు. అలాగే బుద్ధపూర్ణిమ సందర్భంగా బుద్ధుడి బోధనలు, విద్య ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్మిక నాయకుడు సీహెచ్ఎస్ఎన్ రాజు విద్యార్థులకు చిత్రలేఖనం, క్రాఫ్ట్, తెలుగు సామెతల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం, పాఠకులు సురేష్, వర, భవాని, లూసీ, దేముళ్లు, ప్రణతి, కుందన, మోక్షిత పాల్గొన్నారు.

నిబంధనలు మీరితే కఠిన చర్యలు

- సీఐ సతీష్‌కుమార్ హెచ్చరిక
- బార్‌లు, మద్యం దుకాణాలు, హోటళ్లకు పోలీసుల నోటీసులు

పెందుర్తి: సమయ పాలన పాటించకుండా, నిబంధనలు అతిక్రమించి బార్లు, మద్యం దుకాణాలు, హోటళ్లు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. ఆయా వ్యాపారాలు నిబంధనలు విరుద్ధంగా జరిగితే తక్షణమే తమకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. సోమవారం పెందుర్తి సర్కిల్ పరిధిలోని బార్‌లు, మద్యం దుకాణాలు, హోటళ్ల యాజమాన్యాలకు సమయ పాలన, అనధికారిక విక్రయాలపై నోటీసులు అందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం విక్రయాలు ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు, బార్‌లు రాత్రి 11 గంటల వరకు మాత్రమే మద్యాన్ని విక్రయించాలన్నారు. హోటళ్లు రాత్రి 12 గంటల వరకే ఆహారాన్ని అందించాలని సూచించారు. నిబంధనలు మీరితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. ప్రతి దుకాణానికి లైసెన్స్, ఫైర్ ఎన్‌వోసీ, జీవీఎంసీ/పంచాయతీ అనుమతితో పాటు ఆయా వ్యాపార సంస్థల్లో పనిచేసే సిబ్బంది కాండక్ట్ ధ్రువీకరణ పత్రం తమ నుంచి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

భూ ఆక్రమణలపై కఠిన చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

పెందుర్తి: ప్రభుత్వ భూముల సంరక్షణకు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారు ఎంతటివారైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చే ప్రతీ వినతిని క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. మండల వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతులు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ జెరాక్స్, ఆధార్ లింక్ ఫోన్ నెంబర్, వేసిన పంట వివరాలతో ఆయా పంచాయితీల రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. పీజీఆర్ఎస్‌కు మొత్తం 8 వినతులు వచ్చాయి. ఆర్ఐ దివ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్డుతో తప్పని అవస్థలు



సబ్‌స్టేషన్ కూడలిలో ధ్వంసమైన రహదారి

పరవాడ: స్థానిక సబ్‌స్టేషన్ కూడలిలో అధ్వానంగా మారిన రోడ్డుతో ప్రయాణికులు నిత్యం నరకయాతన పడుతున్నారు. రోడ్డు మరమ్మతులు చేపట్టని కారణంగా గత కొంతకాలం నుంచి వాహనచోదకులు, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. కూడలిలో ధ్వంసమైన రోడ్డు కారణంగా భారీ వాహనాల రాకపోకలతో గాల్లోకి లేస్తున్న దుమ్ము పీల్చడం ద్వారా స్థానికులు, ప్రయాణికులు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. దుమ్ము, ధూళి గాల్లోకి లేస్తున్న సమయంలో ఆ ప్రాంతంలోని పాన్‌షాపులు, స్వీట్ షాపులు, టీ, టిఫిన్ దుకాణాలు, కిరాణా షాపులు ధూళితో నిండిపోతున్నాయని దుకాణ యజమానులు గగ్గోలు పెడుతున్నారు. కూడలిలో ధ్వంసమైన రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

పగలంతా ఎండ.. సాయంత్రం వాన



చెరువును తలపిస్తున్న వినాయకనగర్ ప్రధాన రహదారి

- పొంగి పొర్లిన గెడ్డలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం

పెదగంట్యాడ: మండు వేసవిలో అకాల వర్షం దంచికొట్టింది. సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఏకధాటిగా కురిసిన వానకు జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.. గెడ్డలు, కాలువలు పొంగిపొర్లాయి.. రహదారులన్నీ చెరువులను తలపించాయి. సుమారు రెండుగంటలు ఒకే రీతిన వాన పడడంతో మండలంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. దీంతో స్థానికులు బయట అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది.వుడాకాలనీలో స్మార్ట్ ఎదురుగా మొత్తం వర్షపునీటితో నిండిపోయింది. కాలువల్లో నీరు రోడ్లపై ప్రవహించడంతో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలు సాగించలేకపోయారు.



టింపనీ పాఠశాల సమీపంలో రోడ్లపైకి చేరిన కాలువల్లోని మురుగు నీరు



వుడాకాలనీలో స్మార్ట్ షాప్ ఎదురుగా రోడ్డుపైకి వచ్చిన వరదనీరు

ఆలయ నిర్మాణానికి విరాళం



రామాలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న వెంకట్రావు దంపతులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ పెదమడకలో నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి 79వ వార్డు జాబిలీహిల్స్‌కు చెందిన గొల్లవిల్లి వెంకటరావు, కనక భవాని దంపతులు రూ.10,116 నగదును సోమవారం ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులకు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మోటూరి వెంకటరమణ, విందుల నారాయణరావు, గంతకోరు అప్పారావు , నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, మడగల నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.